వైఎస్ఆర్ కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 03 జూలై 2026





# ప్రజా భద్రతకు దాతల అండ

## సేవా స్ఫూర్తికి పోలీసుల ఘన అభినందనలు



**పులివెందుల, జూలై 2, ప్రభాతవార్త :** పులివెందుల పట్టణంలో ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో రూ.36.62 లక్షల వ్యయంతో 120 నిఘా కెమెరాలు, అత్యాధునిక నిఘా నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం కావడం విశేషం. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బీటెక్ రవి సహకారంతో పులివెందుల మున్సిపాలిటీ ప్రజా భద్రతకు ప్రాధాన్యత నిస్తూ రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. అదే విధంగా పట్టణానికి చెందిన వ్యాపారులు, విద్యాసంస్థలు, వివిధ సంఘాలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నగదు, సామగ్రి రూపంలో ఉదారంగా విరాళాలు అందించారు. ఈ సహకారంతో నిఘా నియంత్రణ కేంద్రం ఏర్పాటు కావడం పులివెందుల చరిత్రలో ప్రజల భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న విశిష్ట ప్రజా భద్రతా కార్యక్రమంగా నిలిచింది. ఈ సందర్భంగా దాతలందరికీ ఉప పోలీసు అధికారి మురళీనాయక్ ..మిగతా 2వ పేజీలో

# తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు డ్రిల్లింగ్ చేపడుతాం

## ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



బోర్లు డ్రిల్లింగ్‌కు స్థలపరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :** వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు బోర్లు డ్రిల్లింగ్ చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలసి బాహుదానది పరివాహక ప్రాంతంలో బోర్లు డ్రిల్లింగ్ చేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బంది, టిడిపి నాయకులతో కలసి ఎమ్మెల్యే పెద్దతోపు బహోదాకాలువ పరివాహక ప్రాంతాల్లో అనువైన ప్రాంతాలను పరిశీలించి మోటార్లు బిగించి నీరు సరఫరా చేసే దిశగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఈ శ్రావణ, టిడిపి నాయకులు నవీన్‌చౌదరి, తాళ్ళగిరి, ఏఎస్ఆర్ రాజా, జేసిబి వేణు, టిడిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాయలసీమ రతనాల సీమ చేయడమే కూటమి ధ్యేయం

**శ్రీ సంజీవరాయ స్వామి కుంభాభిషేకము లో పాల్గొనటం ఎంతో అదృష్టం**
**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**





**రాజుపాలెం, జులై 2, ప్రభాతవార్త.** రాయలసీమలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలకు కొదవేలేదు ఉత్తరానా శ్రీశైల మల్లన్న, దక్షిణాన తిరుమల వెంకన్న ఆశీస్సులతో రాయలసీమను రతణాల సీమగా చేయటమే కూటమి ప్రభుత్వ దేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిఅన్నారు. మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గురువారం శ్రీ సంజీవరాయస్వామి నూతన ఆలయప్రారంభోత్సవం, స్వామివారి కుంభాభిషేకమునకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖ మంత్రిగా వెల్లాల శ్రీ సంజీవరాయ స్వామి మహా కుంభాభిషేకమునకు, ఇటీవల ముగిసిన గండి ఆంజనేయస్వామి కుంభాభిషేకమునకు హాజరై దర్శించుకోవడం నాకెంతో అదృష్టమని అన్నారు. నా పదవీకాలంలోనే నిధులు మంజూరు కావడం నిర్మాణం పూర్తి చేసుకొని కుంభాభిషేకమునకు హాజరుకావటం ఇంకా సంతోషంగా ఉందన్నారు. పెద్దాయన స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డికి మాకు రాజకీయ సహవాసంతో పాటు స్నేహబంధం చాలా గొప్పది అన్నారు. ఆయన కోరిక మేరకు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణమునకునిధులు మంజూరు చేయడం నేడు భూమిపూజా కార్యక్రమంలో పాల్గొనటం మరియు ఇంకా పుణ్యక్షేత్రంలోని ఆలయ అభివృద్ధి పనులకు 8 కోట్ల నిధులు అవసరమని అని అడిగిన ఆయన కోరిక మేరకు త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సనాతన ధర్మంలో పాటించే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో దేవాదాయ శాఖ మంత్రిగా నేను ఆలయాల అభివృద్ధికి హిందూ ధర్మ పరిరక్షణ కొరకు పనిచేయటం ఎంతగానో సంతోషాన్ని ఇస్తుందన్నారు. శ్రీవాణి ట్రస్ట్ కింద ఆలయాల నిర్మాణమునకు ప్రజలు ముందుకు రావాలని కోరుతూ, గ్రామాలలో పలు ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద నిధుల అందిస్తున్నామన్నారు. ఆలయాలు నిర్మించడం గొప్పగా ప్రారంభించడం ముఖ్యం కాదని వాటి పవిత్రతను కాపాడటం మనందరి బాధ్యత అని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ వెల్లాల శ్రీ సంజీవరాయ స్వామి విశిష్టత పుణ్యక్షేత్రం యొక్క ప్రాచుర్యం చాలా గొప్పదన్నారు. మంత్రి గారికి మాకు ఉన్న రాజకీయ స్నేహ బంధం 40 ఏళ్ల నాటిదని వెల్లాల పుణ్యక్షేత్రమును శక్తివంచని లేకుండా అభివృద్ధి చేస్తామని, నియోజకవర్గంలోని ఇతర గ్రామాల లోగల ఆలయాల అభివృద్ధి కూడా పాటు పడతానన్నారు. కూలూరు గ్రామంలోని పురాతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి సందర్శించి పూజలు నిర్వహించారు, ఆ గ్రామవాసి ఐఏఎస్ ఆఫీసర్ శ్రీధర్ తనకు చానా సన్నిహితుడు ఆయన కోరిక మేరకు ఈ ఆలయంను కూడా జీర్ణోదరణ చేసి ప్రారంభోత్సవనం కూడా వస్తానని మంత్రి గ్రామస్తులకు తెలిపారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దాయన కోరిక మేరకు వెల్లాల సంజీవరాయ స్వామి ఆలయ నిర్మాణము పూర్తిచేసి, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంనకు నిధులు మంజూరు చేసి, కులూరు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నకు కూడా నిధుల మంజూరు చేస్తామని చెప్పటం, వెల్లాల పుణ్యక్షేత్ర అభివృద్ధికి ఇంకా రూ.8 కోట్ల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, రాఘవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విబిజి రాంజీ పథకం పేద ప్రజలకు వరం

**విబిజి రాంజీ పథకం ద్వారా పేద ప్రజలందరికీ ఆర్థిక భరోసా కలుగుతుంది**
**అరవీడులో బివిజి రాంజీ పథకాన్ని ప్రారంభించిన మంత్రి మండిపల్లి**



అరవీడులు విబిజి రామ్‌జీ పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**గాలివీడు. జూలై 2. ప్రభాతవార్త:** ఎంజిఎన్ఆర ఈ జిఎస్ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న విబిజి రాంజీ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర రవాణా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. పేద ప్రజలకు ఉపాధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఆయన గురువారం మండలంలోని అరవిడి పంచాయితీలో కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ లాంటి ప్రాంతాలలోని ప్రజలకు వి బి జి రాంజీ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటాదని తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు కూలీలకు ఆర్థిక భద్రతనుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మోలిక వసతులు, నీటి భద్రత, జీవనోపాధి వనరులు, ఆస్తుల సృష్టి ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పురం హేమ్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు మందపాటి రవీంద్రబాబు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

# అటవీ శాఖ సిబ్బంది డ్రోన్ కెమెరాలతో ఏనుగుల గుర్తింపు



**సుండుపల్లె, జూలై 02,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం శివారు ప్రాంతమైన శేషాచలం అడవి నుంచి ఏనుగుల గుంపు గత పది రోజులుగా పంట పొలాలలో బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామాలలోకి వచ్చి మామిడి చెట్లు, నీటి పైపు లైన్లు, తదితర వాటిని ధ్వంసం చేసి గ్రామ శివారులో తిష్ట వేసాయి. గ్రామస్తులు రైతులు రాత్రి వేళల్లో డబ్బులు బాణసంచా పేల్చి గత కొద్ది రోజులుగా వాటిని వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఏనుగులకు గ్రామ శివారులోని పొలాలలో పశువుల కోసం వేసిన గడ్డి, మామిడికాయలు, టెంకాయలు దొరకడంతో అవి ఇటువైపే మళ్ళీ మళ్ళీ వస్తున్నాయి. ఈరోజు తిరుపతి భాకరాపేట అటవీ సిబ్బంది వచ్చి కొత్త బిడికి దగ్గర డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తూ ఉండగా ఏనుగుల గుంపు పిల్లలతో వున్నఉనికిని గుర్తించారు. అవి పరికి బండ బిడికి, శివరాంపురం, నగిరి, కటారు ముడుకు తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. కావున అటవీ ప్రాంత శివారు గ్రామాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

# ఎస్ఐఆర్ పథకాన్ని సమర్ధవంతంగా పూర్తి చేయాలి

**బిఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డీవో శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డీవో శ్రీనివాస్, అందులో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

**రాయచోటి జులై 2 ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మున్సిపల్ సభా భవనంలో గురువారం బిఎల్ఓ లకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డీవో శ్రీనివాస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మరియు ముఖ్య ఎన్నికల అధికారి ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు 01.07.2026 అర్హత తేదీగా ఫోటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ 2026 కార్యక్రమం 128 రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రాయచోటి అర్బన్ రూరల్ కింద ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ) ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎనుమి రేషన్ ఫామ్స్ పంపిణీ 99.57 శాతం పూర్తయి, డిజిటైజేషన్ కూడా ఈరోజుకి 33. 5 శాతం పూర్తయిందని తెలిపారు. తదుపరి మిగిలిన శాతం పూర్తి చేయుటకు వ్యవధి తక్కువగా ఉన్నందున త్వరితగతిన ఈ యొక్క ఎనిమిరేషన్ ఫారమ్స్ డిజిటలైజేషన్ మిగిలిన ఓటర్ శాతానికి తగ్గట్టు వేగంగా పూర్తి చేయుటకు ప్రతిరోజు ప్రకారం టార్గెట్ ను నిర్ణయించుకుని నిర్ణయించిన తేదీ లోపల టార్గెట్ పూర్తి చేయవలసి ఉంటుందని సంబంధిత బిఎల్ఓలకు ఆయన ఆదేశించడం జరిగింది. మీ విచారణలో ఏవైనా లోపాలుంటే సంబంధిత సూపర్వైజర్లకు కానీ ఏఇఆర్ఓలకు గాని సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. బిఎల్ఓలు అందరూ మీ మీ ప్రాంతాల రాజకీయ పార్టీ వారు, బూత్ లెవెల్ ఏజెంట్లు సహాయంతో గానీ, ఓటరు జాబితాలో ఉన్నటువంటి కుటుంబ సభ్యుల సహాయంతో గానీ వివాహమై ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి వివరాలను సేకరించి, ఓటరు జాబితాలో వారి పేర్లను తొలగించాలని ఆయన అన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని గాని,ఇతర దేశాలలో నివసిస్తున్న వారిని గాని, మరణించిన వారి వివరాలు సేకరించి ఓటర్ జాబితా నుంచి తొలగించి సవరణ చేయాలని ఆయన బిఎల్ఓ లకు ఆదేశించారు. విచారణ చేసే సందర్భాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే సంబంధిత సూపర్వైజర్లకు గాని ఏఈఆర్వోలకు గాని తెలపవలెనని ఆయన అన్నారు. అంతటితో సమస్య తీరకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలియజేశారు. ముసాయిదా వాటర్ జాబితా ప్రచురణ 21.07.2026, క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ 21.07.2026 నుంచి 20.08. 2026 వరకు గడువు ఉంటుందన్నారు. నోటీసులు జారీ/క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల పరిష్కారం 2108.20 26 నుంచి 18.09.2026 వరకు గడువు .. మిగతా 2వ పేజీలో

# సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత



**జమ్మలమడుగు, జులై 2, ప్రభాతవార్త:** ఈనెల 3న రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనలో భాగంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, బీసీ సంక్షేమ చేనేత, జౌళీ ..మిగతా 2వ పేజీలో

# పులివెందులకు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్

- ❖పులివెందులకు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్
- ❖సాంకేతికతతో మరింత జవాబుదారీతనమైన పోలీసింగ్
- ❖రూ.32.62 లక్షలతో ఏర్పాటు
- ❖120 సీసీ కెమెరాలతో 24 గంటల నిఘా
- ❖ప్రజల సహకారంతో భద్రతా వ్యవస్థ బలోపేతం
- ❖కర్నూల్ రేంజ్ డీఐజి కోయ ప్రవీణ్



వార్త.. 2లో

# కూలీలకు వరం నూతన విబిజి రాంజీ పథకం

## టిడిపి అసెంబ్లీ ఇన్ఛార్జ్ జగన్మోహన్ రాజు



**రాజంపేట, జూలై2, ప్రభాతవార్త** గతంలో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం రూపురేఖలు మార్చి కొత్తగా ప్రవేశపెట్టిన విబిజి రాంజీ పథకం కూలీలకు వరమని, పనులు లేనప్పుడు భరోసా ఇస్తుందని, అంతేకాకుండానిరుద్యోగ భృతి కూడా లభిస్తుందని ఇది ఎంతో ప్రయోజనకరమని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు. మండలంలోని తాళ్లపాక గ్రామంలో గురువారం "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ పథకాన్ని ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంతో విబిజి రాంజీ పథకాన్ని ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 125 రోజులు ఉపాధి పని కల్పించబడుతుందని 15 రోజులకే కూలీలందరికీ పేమెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు.అధికారులు 15 రోజులకు పేమెంట్ ఇవ్వకపోతే ఆ తర్వాత జరిగే రోజులకు వారికి వడ్డీ వేసి పేమెంట్ చెల్లించాలని నిబంధనలు పక్కాగా విబిజి రాంజి చట్టంలో ఉందని తెలిపారు. అంతేకాకుండా పని కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి కూడా ఈ పథకం కింద ఇస్తారని చమర్తి తెలిపారు.వేతనాల చెల్లింపులుఆలస్యం మిగతా 2వ పేజీలో

# విబిజీ రాంజీ పథకం తో ప్రతి కుటుంబానికి 125 రోజులు ఆర్థిక భరోసా



**ప్రొద్దుటూరు అర్బన్ జూలై 2 ప్రభాతవార్త** విబిజీ రాంజీ పథకంతో ప్రతి కూలి కుటుంబానికి 125 రోజులు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్డిఏ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరా రెడ్డి అన్నారు . ప్రొద్దుటూరు రూరల్ మండల పరిధిలోని నాగయ్య పల్లె వ్యవసాయ పొలాల్లో కూలీలకు ఏర్పాటుచేసిన పని ప్రాంతాన్ని ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. ఈ ఏడాది జులై నెల 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న విబిజి రామ్ జి పథకం ఉపాధి హామి పథకం స్థానంలో అమలులోకి వచ్చిన దన్నారు. ఈ పథకంలో ముఖ్యంగా ప్రతీ కుటుంబానికి 125 రోజులు పని, రోజుకు 307 రూపాయలు వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. 15 రోజులలో పని చేసిన శ్రామికులకు వేతన చెల్లింపులు జరుగుతాయని, చెల్లింపులు ఆలస్యం అయితే ఆలస్యపు పరిహారం కూడా 0.05 శాతం శ్రామికులకు అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మోలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత వుంటుందన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి అధిక ప్రాధాన్యత వుంటుందన్నారు. కూలీలు పూర్తి సమయం పని చేస్తే పూర్తి మొత్తం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, ఏపీవో మహేశ్వర్ రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, టిఏలు, చెన్నమ్మ రాజు పల్లె, నాగయ్య పల్లె రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.




# అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత

## మామిడి మండీ వద్ద పొంచి వున్న ప్రమాదం



చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త

నిత్యం వాహన రాకపోకలు అధికంగా గల ప్రాంతమది...ఇటు మామిడి మండీ అటు హరిశ్చంద్రఘాట (స్మశానవాటిక)లు వున్నాయి...అయితే ప్రధాన రహదారికిరువైపులా అడ్డదిడ్డంగా భారీ వాహనాలు పెడుతున్న వైనం...చౌడేపల్లికి అతి సమీపంలో చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో ఈ పరిస్థితి నెలకొని వుంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో మార్కెట్‌కు వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతోంది. అయితే మార్కెట్ యాజమాన్యం సరైన పార్కింగ్ చూపించక పోవడంతో లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు వాహనాలను రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ నియమాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారని వాహనదారులంటున్నారు. రహదారికిరువైపులా భారీ వాహనాలు నిలపడం వల్ల ప్రయాణించే రోడ్డు ఇరుకుగా మారుతోందనీ, ఎదురెదురుగా వచ్చే వాహనాలకు దారి దొరకడమే కష్టమవుతోందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ వాహనాలు సరిగ్గా కనిపించక భారీగానే ప్రమాదాలు సంభవించే అవకాశముందని స్థానికులంటున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదం సంభవించక ముందే చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# విబిజి రాంజీ పథకం

మొదటి పేజీ తరువాయి

జరిగితే తగిన పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, ఇది ఉపాధి కూలీలకు ఎంతో ఊరట నిచ్చే అంశం అన్నారు. అంతకుముందు తాళ్లపాక గ్రామస్తుల వినతి మేరకు పొలాలలోకి రహదారి,వంకలు కాలువలు పలు సమస్యలను జగన్ మోహన్ రాజు గారి దృష్టికి తీసుకురాగా సర్వే చేయించి వాటి ద్వారా పనులు చేపట్టి ఆధునికరించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, ఎంపీడీవో వరప్రసాద్,ఏపీవో సాలయ్య, స్థానిక టిడిపి నేత ఉద్దండం సుబ్రహ్మణ్యం ,గ్రామ అధ్యక్షులు లక్ష్మీనరసరాజు,జనార్దన్ రాజు,మండల క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, దాసరి కళాధర్,రైతు వీరయ్య, మన్నూరు సొసైటీ డైరెక్టర్ పరశురాం నాయుడు , తాళ్లపాక గ్రామస్తులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెచ్యూర్ పదంపై తప్పుడు అవగాహన

## మదనపల్లెలో మాస్టారుపై విద్యార్థుల తల్లిదండ్రుల దాడి



మదనపల్లెక్రైం, జూలై 2 ప్రభాతవార్త.

మదనపల్లెలో మెచ్యూర్ అనే ఆంగ్ల పదం తెచ్చిన తప్పుడు అవగాహనతో ఒక ఉపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు దాడి చేసిన ఘటన స్థానిక కోట బడి మున్సిపల్ హైస్కూల్లో గురువారం కలకలం రేపింది. బుధవారం ఎనిమిదో తరగతి గదిలో అల్లరి చేస్తున్న విద్యార్థినులను ఫిజిక్స్ టీచర్ చిరంజీవి మందలిస్తూ.. "మీరు ఇప్పటికే మెచ్యూర్ (మానసిక పరిణతి) అయ్యారు. ఇప్పటికీ ఇలా అల్లరి చేస్తే ఎలా?" అని ప్రశ్నించారు. అయితే, ఆ విద్యార్థినులు ఈ పదానికి ఉన్న అసలు అర్థాన్ని గమనించకుండా, శారీరక పరిణతి (పెద్దమనిషి కావడం) అనే తప్పుడు అర్థంలో భావించి ఇంటి వద్ద తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన తల్లిదండ్రులు గురువారం బడికి వచ్చి ఉపాధ్యాయుడిపై భౌతిక దాడికి దిగారు. సమాచారం అందుకున్న ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి రంగంలోకి దిగి, ఇరు వర్గాలతో మాట్లాడారు. అది కేవలం మాటల అవగాహనా లోపమేనని సర్దిచెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయనని ఉపాధ్యాయుడు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై డిఇఒ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేసి విచారణ చేస్తున్నామన్నారు.

### ఈనెల 30, 31న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరిసంహారావు

మదనపల్లె, జూలై 2 ప్రభాతవార్త :

ఈనెల 30, 31న కార్మికుల సమస్యలపై చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు తెలిపారు. గురువారం స్థానిక ఎన్‌జిఒహోమ్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు హరిశర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను కార్మికులకు ఏళ్ళ తరబడి సవరించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని వారి ఇచ్చే వేతనాలు చాలడం లేదన్నారు. కనీస వేతనాల కోసం కార్మికులు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. లేబర్‌కోడ్లును దేశంలో అమలు చేయకూడదన్నారు. 12గంటల పనివిధానం మానుకోవాలన్నారు. నిత్యవసరవస్తువుల ధరలు పెద్దఎత్తున పెరుగుతున్న కనీస వేతనాలు మారతం అమలు చేయడం లేదన్నారు. పంచాయితీ కార్మికులకు పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించి ప్రతి నెల ఒకటో తేదిన వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా కోశాధికారి డి.భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, జయమ్మ, రాణెమ్మ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, బీవీరమణ, కార్మికులు పాల్గొన్నారు.

### జీవో నెంబర్ 396ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్



పీలేరు జూలై 2 ప్రభాతవార్త:

ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 396 వెంటనే ఉపసంహరించుకోవాలని దస్తావేజులేఖరులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి సబ్ రిజిస్ట్రార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో ఫ్రంట్ ఆఫీసులు ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల దస్తావేజులేఖర్లు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోతారన్నారు. తద్వారా వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. చట్టబద్ధత లేని ప్రయివేట్ సంస్థలతో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్య విధానాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖర్లు స్టాంపుల మస్తాన్, నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి, బాదర్ వల్లి, చలపతి. సురేష్, సయ్యద్. కుమారి. రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతం చేయండి



మొదటి పేజీ తరువాయి

శాఖామంత్రి ఎస్.సవిత తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసనసభ్యులు సి.ఆదినారాయణరెడ్డి, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా జేసీ డా.నిధీ మీనా, సబ్ కలెక్టర్ భావన, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, నాయకులు భూపేష్‌రెడ్డిలతో కలిసి జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో రాష్ట్ర సీఎం పర్యటించే ప్రాంతాలను, ఏర్పాట్లను పరిశీలించారు. కర్మాగార సైట్‌లో సీఎం రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను, శంకుస్థాపన శిలాఫలకాలు, అనంతరం అక్కడి సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక, సీఎం, మంత్రుల తాత్కాలిక రెస్టింగ్ రూంలు, కంపెనీ ఎక్స్ పీరియన్స్ జోన్, గ్రీన్ రూం మొదలైన, సీఎం పాల్గొనే అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం పర్యటనలో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

# చింతపర్తిలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

## గ్రామ సచివాలయంలో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష



గ్రామ సచివాలయంలో జిల్లా కలెక్టర్ అధికారులకు సమీక్ష

పీలేరు, జూలై 2 ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబిజిరామ్ (గ్రామీణ్) – వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్" కార్యక్రమాన్ని గురువారం దేశవ్యాప్తంగా ప్రారంభించింది. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రారంభించగా, చింతపర్తి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గత రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకం గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. కొత్త పథకంలో పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బీఎల్వోలతో సమావేశమై, ఇప్పటివరకు నమోదైన పురోగతిని సమీక్షించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ శాతాన్ని మరింత పెంచి కనీసం 50 శాతం పురోగతి సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా–2002 ఆధారంగా పరిశీలన చేపడుతున్న సమయంలో కొన్ని రికార్డులు అందుబాటులో లేక పోవడం అధికారుల దృష్టికి తీసుకురాగా, ఆ అంశాన్ని నమోదు చేసి భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. మ్యాపింగ్ మరియు ఇతర అనామలీస్ సంఖ్యను గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరిని గుర్తించి సంబంధిత వివరాలను సరిచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గతంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ శాతం తక్కువగా ఉండడానికి గల కారణాలను ఆరా తీసిన కలెక్టర్, ప్రస్తుతం పురోగతి మెరుగుపడుతున్నప్పటికీ మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ డి వో లక్ష్మీ మ్రపతి, తాసిల్దార్ పామిలేటి, బిఎల్‌వోలు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలకు దూరంగా ఉండండి చదువుతో ఉన్నత శిఖరాలకి చేరాలి

## డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆర్. ప్రసన్నలత



విద్యార్థినీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పులివెందుల జులై 2, ప్రభాత వార్త :

స్థానిక బాలికల హాస్టల్‌లో "బేటీ బచావో–బేటీ పడావో" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆర్. ప్రసన్న లత ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు బాల్య వివాహాల నివారణ, బాలికల విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక ఆడపిల్ల కేవలం ఒక కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి గొప్ప ఆస్తి అని అన్నారు. అమ్మాయిలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళ విద్యావంతురాలైతే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని చెప్పారు. 18 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం చట్టవిరుద్ధమని, బాల్య వివాహాల వల్ల బాలికల చదువు మధ్యలోనే ఆగిపోవడంతో పాటు చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాలు ఏర్పడే అవకాశముందని వివరించారు. ప్రతి అమ్మాయి తన చదువును పూర్తి చేసి, స్వయంగా నిలబడే స్థాయికి చేరుకోవాలని సూచించారు. డాక్టర్, ఇంజనీర్, టీచర్, నర్స్, శాస్త్రవేత్త, ఐఏఎస్ అధికారి వంటి ఏ రంగంలోనైనా విజయాలు సాధించే సామర్థ్యం ప్రతి అమ్మాయికి ఉందని, తమ కలలను ఎప్పుడూ చిన్నవిగా భావించవద్దని విద్యార్థినులకు ప్రోత్సాహం ఇచ్చారు. త ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు అనంతరం విద్యార్థినులతో "బాల్య వివాహాలకు దూరంగా ఉంటాం.. చదువును కొనసాగిస్తాం.. ప్రతి ఆడపిల్లను గౌరవిస్తాం.. రక్షిస్తాం.. చదివిస్తాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహ ప్రత్యూష, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. లక్ష్మి, ఏఎన్ఎంలు చిలకమ్మ, సునీత, ఆశా కార్యకర్త రామాంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్



పులివెందుల, జులై 2,ప్రభాత వార్త :

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పులివెందుల పట్టణంలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు,సాంకేతికతతో, సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత జవాబుదారీతనంతో పోలీసు సేవలు అందించేలా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు . స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ పట్టణంలోని రింగ్ రోడ్‌తో పాటు ప్రధాన కూడళ్లలో మున్సిపాలిటీ, వ్యాపారవేత్తలు, దాతల సహకారంతో రూ.32.62 లక్షల వ్యయంతో 120 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాల నివారణతో పాటు నేరస్థులను వేగంగా గుర్తించడంలో ఈ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతా యని చెప్పారు. నియోజక వర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు డ్రోన్ కెమెరాలను అనుసంధానించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.పట్టణంలో మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ను నియంత్రణ చేస్తామని ప్రభుత్వ నిధులతో నిర్మించిన లింగాల పోలీస్ స్టేషన్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పులివెందుల ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, మున్సిపాలిటీ సహకరించాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సహకారంతో మున్సిపాలిటీ రూ.12 లక్షలు అందించిందని ప్రాజెక్టు కింద సుమారు 35 కిలోమీటర్ల పరిధిలోని తొమ్మిది ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్టు వీటి ద్వారా వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ పరిస్థితులు, అనుమా నాస్పద కదలికలను 24 గంటలు పర్యవేక్షించను న్నట్లు,అలాగే పట్టణంలోని కీలక ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ స్పీకర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అత్యవసర హెచ్చరికలు, ట్రాఫిక్ మళ్లింపు సూచనలు, తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల సమాచారాన్ని ప్రజలకు తక్షణమే చేరవేయనున్నట్లు తెలిపారు. అంతకు మునుపు కమాండ్ కంట్రోల్ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ను జిల్లా ఎస్పీషెల్కే నచికేత్ విశ్వనాథ్ పులివెందుల డిఎస్పి మురళి నాయక్ లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డిఐజి కి విద్యార్థులు పూలు చల్లుతూ సాదరంగా ఆహ్వానించారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం అర్బన్ స్టేషన్ నందు ఉన్న కంట్రోల్ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కమాండింగ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును ఏ విధంగా నేరాలను గుర్తించడం జరుగుతుందో సాంకేతికత నాణ్యతను గురించి పర్యవేక్షించారు. జిల్లాలో ప్రొద్దుటూరు పులివెందుల తదితర ప్రాంతాలలో అత్యాధునిక కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేసినందుకు జిల్లా ఎస్పీని అభినందించారు. పులివెందులలో కంట్రోల్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన దాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి, డి.ఎస్.పి మురళి నాయక్ లు డిఐజిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, డీఎస్పీ మురళి నాయక్, మున్సిపల్ కమిషనర్ మునికుమార్, అర్బన్ సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు, వేంపల్లి సీఐ నరసింహులు, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీసు సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

# పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఉంటుందన్నారు.తుది ఓటరు జాబితా ప్రచురణ 22092026 న ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం అంతా పూర్తయిన తదుపరి 1200 మంది ఓటర్ల జాబితా ప్రకారం ఒక బూత్ చొప్పున ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, రాయచోటి మండల తహసిల్దార్ జానపాటి యామిని, మున్సిపల్ సిబ్బంది, మండల రెవెన్యూ సిబ్బంది, బిఎల్వోలు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతకు దాతల అండ



మొదటి పేజీ తరువాయి

అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత కోసం అందించిన సహకారం చిరస్మరణీయ మని, వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది సామాజిక కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు. ప్రజల సహకారంతో పులివెందులలో నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.నిఘా కేంద్ర ఏర్పాటుకు సహకరించిన ప్రతి దాతను ఉప పోలీసు అధికారి మురళీనాయక్, పట్టణ పోలీసు ఇన్స్పెక్టర్ శ్రీరామ్, వేంపల్లి పోలీసు ఇన్స్పెక్టర్ నరసింహులు, పోలీసు అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసుఅధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు, వివిధ సంఘ నేతలు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్‌లో వైసీపీ నాయకులు బిజీ బిజీ



కలికిరి, జులై 2, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమంపై వైసీపీ నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల రాజంపేట ఎంపి వెంకట మిథున్‌రెడ్డి పీలేరులో సర్ కార్యక్రమంపై రాజంపేట పార్లమెంటు ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్ కార్యక్రమంలో భాగంగా వైసీపీ నాయకులకు చెందిన ఓట్లు తొలగించేలా ప్రయత్నం చేస్తున్నారని సర్ కార్యక్రమం పై వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీంతో బుధవారం కలికిరి మండలం వైసీపీ ప్రధాన కార్యదర్శి గుట్టపాలెం పంచాయతీ వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంభం ద్వారకనాథ్‌రెడ్డి గుట్టపాలెం పంచాయతీలో 207, 208 పోలింగ్ బూతులకు సంబంధించి బీఎల్‌ఓలతో ఓటరు మ్యాపింగ్ కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా తమ పార్టీకి చెందిన వైసీపీ నాయకులు ఓటర్లే కాకుండా పంచాయతీకి చెందిన ఓటర్లకు సంబంధించి ఎమునరేన్ ఫారాలు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలలో ఏ ఒక్కరికి ఓటు పోకుండా గ్రామాల్లో పర్యటించి ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సర్ కార్యక్రమంలో పాల్గొంటామని ఆయన తెలిపారు.

### దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ



గాలివీడు, జూలై 02. ప్రభాతవార్త:

దివ్యాంగ విద్యార్థులకు గురువారం ఉచితంగా సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గాలివీడు మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు వారి అవసరాలకు అనుగుణంగా సీపీ చైర్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం కిట్లు అందజేశారు.లబ్ధిదారులుగా పి. సారాకాణం, టి. పద్మజ, ఎం. రెడ్డమ్మ, పి. సభానసం, ఎం. రేవంత్ నాయక్, కే. షరీమల ఉపకరణాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఐఆర్‌పీలు వి. ఖలందర్, టి. కృష్ణవేణి, ఆర్. శారద (ఎస్ఏ–స్పెషల్) సమక్షంలో ఉపకరణాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు పి. నాగరాజు, వి. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధి, స్వయం సమర్థత కోసం వివిధ రకాల సహాయక ఉపకరణాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉపకరణాలు విద్యార్థుల విద్యాభ్యాసాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు వారి దైనందిన జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

### కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ



పీలేరు,, జూలై 2 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను తీవ్రంగా దోచుకుంటున్నాయని, ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒక విద్యార్థిని చదివించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును ఆసరాగా చేసుకుని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేయడం, అలాగే ఐఐటి, జేఈఈ,వినినిగి కోచింగ్ పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ప్రకారం కల్పించాల్సిన ఉచిత ప్రవేశాలు, ఇతర సౌకర్యాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల విక్రయాల్లో జరుగుతున్న అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మద్దెల అమృత్ తేజ కోరారు.

# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



పీలేరు, జూలై 2, ప్రభాతవార్త:

పీలేరు లయన్స్ క్లబ్ ఏడాది కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. గురువారం స్థానిక సీఎన్ఆర్ కళాశాలలో లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా చింతల విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేంద్రరెడ్డి, కోశాధికారిగా పి.వి. రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారు మాట్లాడుతూ లయన్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని, వైద్య సేవ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

### ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక డిజిటలైజేషన్ శిబిరాలు

జిల్లాకలెక్టర్ నిశాంత్‌కుమార్



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిని మెరుగుపరిచేందుకు ఈనెల 4, 5వ తేదీల్లో ప్రత్యేక డిజిటలైజేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని డ్రైవ్ మోడ్‌లో చేపడుతున్నట్లు తెలిపారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతిరోజూ ఎన్నికల నమోదు అధికారులు,సహాయ ఎన్నికల నమోదు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శిబిరాల వద్ద అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం, కంప్యూటర్ వ్యవస్థలు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరాల పురోగతిని నిరంతరం సమీక్షించి జిల్లా కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక డిజిటలైజేషన్ కార్యక్రమం అమలులో ఎలాంటి అలసత్వం నిర్లక్ష్యం ప్రదర్శించినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. బిఎల్ఓలు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాల్లో లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో డిజిటైజేషన్ ముఖ్యం

## వైకాపా సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మాజీ కోప్షన్ సభ్యులు శరాదారెడ్డి ఆధ్వర్యంలో ఓటరు జాబితాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, వివరాల సవరణ, మార్పులు, అభ్యంతరాలకు సంబంధించిన ధరఖాస్తు ఫారాలను ఎలా నింపాలో వివరించారు. నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధరఖాస్తుల డిజిటైజేషన్ ప్రక్రియ వేగంగా జరగడం లేదని, అర్హులైన ఓటరు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేధావుల పోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డి, శారదారెడ్డి, బొమ్మిశెట్టి మదు, ఎస్.నవాజ్, యూనస్. మహేష్, బయ్యారెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి,మంజుల, బిఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విబిజి రామ్‌జీ పథకాన్ని రద్దుచేయాలి

## పాత ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలి



మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చుతూ పేదల పొట్టకొట్టే విధంగా తీసుకువచ్చిన జీరామ్‌జి విధానాన్ని రద్దు చేయాలని గతంలో ఉన్న ఉపాధిహామీ పథకాన్ని పునరుద్దరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రిష్ణప్ప ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వ్యవసా య కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ కూలీలు, మహిళలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలకడ మండలంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ 2005 ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు కొండంత అండగా ఉండేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ బడ్జెట్‌లో కోతలు విధిస్తూ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తొందని మండి పడ్డారు. జిల్లాలో రద్దు చేసిన జాబ్‌కార్డులను వెంటనే పునరుద్దరించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సోమశేఖర్, మహ్మద్‌అలీ, లలిత, వెంకటమ్మ, శ్రీరాములు, శివయ్యలు పాల్గొన్నారు.

CHANGE OF SURNAMES

1 Padakandla Hussain Basha, S/o Padakandla Mahaboob Hussain, D.No.5-41, Velavali (V), Rajupalem (M), Kadapa (Dt), A.P. 516359. My Family Members Surnames Change For Passport No.R2374017, ARN No 26-1063867280. From 1. Shaik Hussain Basha To Padakandla Hussain Basha, 2. Shaik Mahaboob Hussain To Padakandla Mahaboob Hussain, 3. Shaik Hussaina To Padakandla Hussain Bee, 4. Gunad Begum To Padakandla Gunnaj Begam. VIDE AFFIDAVIT DATED 30-06-2026 BEFORE.

## ప్రభుత్వ డాక్టర్‌చే వైద్య శిబిరం

సుండుపల్లె, జూలై 02 ప్రభాతవార్త :



మండల పరిధిలోని పుల్లారెడ్డిగారిపల్లి దగ్గర ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల నందు కడప జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము ప్రభుత్వ డాక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర నాయుడు తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాల నందు దాదాపు 98 మంది పిల్లలకు అందరికి జబ్బులపై స్క్రీనింగ్ చేసి తగిన మందులు ఇచ్చి ఆరోగ్యం పట్ల పిల్లలందరికి అవగాహన కల్పించడమైనదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,సి హెచ్ ఓ,రామకృష్ణ యాదవ్, సూపర్‌వైజర్స్ సదాశివారెడ్డి, అలివేలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, రామయ్య, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఫిర్దోస్, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నీ తామై అంత్యక్రియలు

ప్రొద్దుటూరు అర్బన్, జులై 1, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వాసుపత్రి నందు గరికపాటి పృథ్వీరాజ్ రైలు ప్రమాదంలో మరణించగా మృతదేహాన్ని మార్చురీ నందు ఉంచగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు స్పందించి గురువారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. మేఐహెల్ప్యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే తమను సంప్రదించాలన్నారు.

## విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

వేంపల్లె: జూలై 02 ప్రభాతవార్త



కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్పొరేట్ తరహా విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చారని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యాసంస్థలపై విచారణ చేపట్టి, అధిక ఫీజుల వసూళ్లు అరికట్టాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, ఉత్తన్న, అమర్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తులసి రెడ్డిని కలిసిన ఆర్ఎంపీలు

వేంపల్లె జూలై 02 ప్రభాతవార్త



కడప జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు గురువారం వేంపల్లెలో నర్రెడ్డి తులసి రెడ్డిని కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తులసి రెడ్డి వారి సమస్యలను సావధానంగా విన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఏ ఆంజనేయులు, కార్యదర్శి ఖలీలుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ అమీర్,జిల్లా డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, నాగార్జున,కరీముల్లా,, రామకృష్ణ, ఖలీల్, రామాంజనేయులు, రవి, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. కడప, ప్రొద్దుటూరు, దువ్వూరు, కమలాపురం, వేంపల్లికు చెందిన ఆర్ఎంపీలు తులసి రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

## దోమల పట్ల అప్రమత్తంగా ఉండండి

సిద్ధవటం, జూలై 2 ప్రభాతవార్త



డెంగ్యూ పై అపోహలు వద్దని ప్రతి ఒక్కరూ శుభ్రత, పరిశుభ్రత పాటించి గృహాల చుట్టూ నీరు నిలువ లేకుండా చూడాలని వైద్య సిబ్బంది తెలిపారు. మండల కేంద్రమైన సిద్ధవటం ఎస్టీ కాలనీలో గురువారం జూలై 1 నుండి 30 వరకు జరిగే డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ మోలాలి మాట్లాడుతూ పి కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ కొరకు ప్రతి ఒక్కరు శుభ్రత పరిశుభ్రత పాటించి ఆరోగ్య వంతులుగా ఉండాలని గృహాల చుట్టూ నీరు నిలువ లేకుండా చూడాలని లార్వా ఉత్పత్తి కాకుండా తగు సూచనలు అందించామన్నారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నరసమ్మ, హెల్త్ సూపర్వైజర్లు శారదాదేవి, మోలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య ఆరోగ్య కార్యకర్తలు, అంజనమ్మ, శారద, ఆశా వర్కర్లు భారతి, ఓబులమ్మ, పద్మ, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఇక నుండి 125 రోజులు పని దినాలు

పెద్దమండెం జూలై 2 ప్రభాతవార్త

నేటి నుండి ఉపాధి హామీ పథకం స్థానంలో విబిజి రాంజీ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం కూలీలకు పని దినాల పెంచడం దినసరి కూలి పెంచడం జరుగుతుందన్నారు. అలాగే చేసిన పనులకు వారం రోజుల్లో కూలీలు చెల్లించడం ఆలస్యానికి అదనంగా 0.5% వడ్డీ చెల్లించడం జరుగుతుందన్నారు రోజుకు 312 రూపాయలు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు భూగర్భ జలాలు పెంచడం వాటిపై అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు వ్యవసాయం చేసుకోవడానికి రైతులకు అనువుగా 60 రోజులపాటు పని దినాలకు నిలిపివేయడం జరుగుతుందన్నారు రైతుల ఆర్థిక అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రావు ఏపీవో సురేంద్రనాథ్ రెడ్డి టిఏలు ఎఫ్ఏలు శ్రామికులు పాల్గొన్నారు.



విబిజి రామ్ జి పథకం గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఐఎంఏ రాజంపేట శాఖ నూతన కార్యవర్గం

రాజంపేట, జూలై 2 ప్రభాతవార్త




ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజంపేట శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక ఐఎంఎ హాల్లో జరిగింది. ఎన్నికలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా డాక్టర్ జయగౌరి, సెక్రెటరీగా డాక్టర్ మునిబాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ నవీన్ కుమార్, ట్రెజరర్ గా డాక్టర్ విజయలక్ష్మి ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ బాల రాజు మాట్లాడుతూ నూతన కార్యవర్గం గ్రామీణ ప్రాంత ప్రజలకు వీలైనంత మేరకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప లువురు వైద్యులు పాల్గొన్నారు.

## రక్షణ కోసం జిల్లా అధికారులను వేడుకున్న బాధితురాలు

కడప కార్పొరేషన్ జూలై 2 ప్రభాతవార్త:



రక్షణ కల్పించాలని మహిళ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించాలని సాయిపేటకు చెందిన షేక్ మోలాని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కడపలో విలేకరులతో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె మాట్లాడుతూ తనపై అక్రమంగా కేసు బనయించిన వారే తనను హతమార్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తనకు జరగరానిది జరిగితే తన భర్త, బిడ్డలకు దిక్కెవరని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డి, అధికారులు జోక్యం చేసుకుని తనకు తగిన న్యాయం చేయాలని వేడుకున్నారు. వేధింపుల బారి నుంచి రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మోలాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జనసేన బలోపేతమే ఎకైక లక్ష్యం

వేంపల్లె జూలై 02 ప్రభాతవార్త

గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతమే ఎకైక లక్ష్యమని ఆ పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు దాసరి రవిశంకర్ వెల్లడించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పార్టీ పదవుల నమోదు చేసుకునేందుకు నేడు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, కడపలోని హరిత హోటల్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశక్తి కలిగి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుతో పాటు పార్టీ గుర్తింపు, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పనిసరి జతపరచాలని సూచించారు. నిర్ణీత సమయంలో హాజరై దరఖాస్తు నమోదు చేసుకోవాలన్నారు.

## మానసిక వికలాంగులు, నిరాశ్రయులకు అన్నదానం

ముద్దనూరు జూలై 02. (ప్రభాతవార్త )



మండలంలోని కోడిగాండ్లపల్లె పరిధిలో ఉన్న యేసు కరుణాలయంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, మానసిక వికలాంగులు, నిరాశ్రయులకు వేల్పుచెర్ల గ్రామ మాజీ సర్పంచ్ దివంగత శిరియపురెడ్డి శివారెడ్డి రెండవ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత శివారెడ్డి చిత్రపటానికి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులు, మానసిక వికలాంగులు, నిరాశ్రయులకు ప్రేమతో భోజనాన్ని వడ్డించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిరియపురెడ్డి అనిల్ కుమారి, డాక్టర్ లోకేశ్వరరెడ్డి, ముకుల్, ధృవిక రెడ్డి, మణికంఠ రెడ్డి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సమాజ సేవే దివంగత శివారెడ్డికి నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.

## బలి తీసుకొంటున్న సుండుపల్లె రాయచోటి రోడ్డు

సుండుపల్లి, జూలై 02, ప్రభాతవార్త :



రాయచోటి-సుండుపల్లి రహదారిపై గురువారం తెల్లవారుజామున అనుంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువగుల్లవాండ్లపల్లె కి చెందిన గంగాధర్ అనే వ్యక్తి మృతి చెందాడు. వివరలలోకి వెళితే వ్యాపారం రీత్యా సుండుపల్లి నుండి రాయచోటికి ఆటోలో వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందారు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. రోజుల్లో లెక్కలేనన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికి ప్రభుత్వం స్పందించడం లేదనియు,డబుల్ రోడ్డు పనులు ఆగిపోవడం వలన ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనియు,నాయకులు ఓట్లు కోసం కాకుండా మనుషుల ప్రాణాలు మట్టిలో కలిసిపోకుండా చూసి పనిచేయాలని పలువురు వాపోతున్నారు.

## ప్రభుత్వ ఆలయ కమిటీలలో విశ్వబ్రాహ్మణులకు అవకాశం కల్పించండి

ప్రొద్దుటూరు జూలై 2 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వ దేవాలయ కమిటీలలో విశ్వబ్రాహ్మణులకు సభ్యులుగా లేదా డైరెక్టర్లుగా అవకాశం కల్పించాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వడ్ల శ్రీనివాస చారి విశ్వకర్మ సమైక్య విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఉత్తరాది రమణాచారి ఏవి భాస్కర రావు లు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రొద్దుటూరులో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ని స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి సమక్షంలో ప్రత్యక్షంగా కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంతో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి మఠమున స్వాముల వారికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని, స్వామివారి మఠంను అభివృద్ధి పరచాలని కోరారు ఈ సందర్భంగా వారు మంత్రి ఆనంద్ రామనారెడ్డిని కలిసేందుకు అవకాశం కల్పించిన స్థానిక శాసనసభ్యులు నంద్యాల వరదరాజు రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పోతురాజు గడ్డ పరిరక్షణ, పునరుద్ధరణకు విజ్ఞప్తి



ప్రొద్దుటూరు అర్బన్, జులై 1, ప్రభాతవార్త

పట్టణంలోని పాత మార్కెట్ ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఉన్న చారిత్రక పోతురాజు గడ్డ పరిరక్షణ మరియు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రొద్దుటూరుకు విచ్చేసిన మంత్రి రామనారాయణారెడ్డిని నేరుగా కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పోతురాజు గడ్డ ప్రస్తుతం అన్యాక్రాంతమై కనిపించకుండా పోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలు కుండలలో నీటిని తీసుకువచ్చి ఈ గడ్డపై అభిషేకాలు నిర్వహించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని మొక్కుకునే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోందని వివరించారు. అయితే ఈ చారిత్రక స్థలం ఆక్రమణలకు గురై తన అసలు రూపాన్ని కోల్పోవడం వల్ల స్థానిక ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తక్షణం గుర్తించి పరిరక్షణ చర్యలు చేపట్టి, దాని పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివశక్తి జిల్లా అధ్యక్షులు పుల్లారెడ్డి, ప్రొద్దుటూరు అధ్యక్షుడు ప్రశాంత్, బీజేపీ ప్రొద్దుటూరు అధ్యక్షులు వంకదరా నరేంద్రరావు, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి సమక్షంలో వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

## రాష్ట్ర రాజధానిగా మావిగన్ నినాదంతోనే ప్రజల్లోకి వెళతాం

### మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు జూలై 2 ప్రభాతవార్త



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన విధంగానే రాష్ట్ర రాజధానిగా మావిగన్ నినాదంతోనే ప్రజల్లోకి వెళతామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విలేఖరుల సమావేశంలో స్పష్టంగా ప్రజా భీష్టం మేరకు ఆయన వైఖరిని వెల్లడించారని, మావిగనే 2029 లో వైసీపీ అజెండా అని, మావిగన్ ను రాజధానిగా కోరుకునే వారే వైసీపీ కి ఓటేయాలని తెలిపారు. కాగా అమరావతి రాజధాని నిర్మాణానికి 1 లక్ష ఎకరాలు సంవత్సరానికి 3 పంటలు పండే భూమిని వినియోగించడంతో పాటు దాదాపు 2 లక్ష కోట్ల రూపాయల ప్రజా ధనం అవసరమని, కానీ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు (మావిగన్) అయితే జాతీయ రహదారి, పోర్ట్, ఎయిర్ పోర్ట్, విద్యాసంస్థలు, రైల్వే లైన్ అందుబాటులో వున్న కారణంగా దాదాపు 10 నుండి 20 వేల కోట్ల రూపాయలకే రాజధాని పూర్తవుతుందని జగన్ వివరించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ మావిగన్ తమ రాజధాని కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేసి వుంటే కూటమికి ఓటేయాలని, అభివృద్ధి, సంపద సృష్టి కూటమి పాలనలో జరిగి వుంటే వారికే ఓటేయాలని, చంద్రబాబు పాలనలో శాంతి భద్రతలు క్షీణించి వుంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరతామని వివరించారు. కాగా జగన్ మాటలను కూటమి నాయకులు వక్రీకరించకుండా అమరావతి వారి అజెండా అని, ఎన్ని సంవత్సరాలలో పూర్తి చేస్తారో తెలిపి ఓట్లడగాలని వివరించారు. ప్రజాభిప్రాయమే జగన్ మాట, జగన్ మాటే తమ బాటన్నారు.

## మూడు పద్ధతులతో డెంగీని ఓడిద్దాం

మదనపల్లెక్రైం, జూలై 2 ప్రభాతవార్త.



మూడు నిబంధనలు పాటించి డెంగీని తరిమికొడదామని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రం మదనపల్లెలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నరసయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ ఏడాది డెంగీ వ్యతిరేక మాసోత్సవాల థీమ్ "మూడు పద్ధతులు - పరిశీలించండి, శుభ్రపరచండి, మూతలు పెట్టండి - పాటిద్దాం, డెంగీని ఓడిద్దాం" అని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం డెంగీ జ్వరాలు ప్రజా ఆరోగ్య సమస్యగా మారాయని, ప్రజల్లో చైతన్యం, అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ ఇంటి పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచుకోవాలని, నీటి నిల్వలపై మూతలు ఉంచాలని సూచించారు. ఈ చైతన్యం ప్రతి ఇంటికి చేరేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ నినాదాలు చేయిస్తూ డెంగీ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ రాధిక, పరిపాలన అధికారి డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఆర్బీఎస్కే జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఓ ఓబుల్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్, ఎల్‌టి శివ, ఎస్‌టిఎస్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్స్ గంగయ్య గౌడ్, కిరణ్, పట్టణ ఆరోగ్య కేంద్ర ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రెగ్యులర్ కార్యదర్శి నియామకం

దువ్వూరు, జూలై 02, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరు గ్రామ పంచాయతీకి బుధవారం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జరిగిన పదోన్నతులలో పంచాయతీ కార్యదర్శిని నియమించారు. మండల పరిధిలోని మాసనపల్లె గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మార్తల భాగ్యలక్ష్మిని పదోన్నతిపై దువ్వూరు పంచాయతీ కార్యదర్శిగా నియమించారు. భాగ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీ అయిన దువ్వూరులో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, మంచినీటి సమస్య ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు.

## బద్వేల్‌లో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్‌పై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

బద్వేలు అర్బన్ , జూలై 2, ప్రభాతవార్త:

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని విద్యానగర్ స్వర్ణ వార్డులో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్, ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు 1,000కు పైగా ఓటర్లు ఉన్న ప్రతి బీఎల్ఓ కు అదనపు సహాయక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువు లోపు ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ ఎం. కృష్ణ అధికారులను ఆదేశించారు.



## నూతన మేనేజర్‌కు ఆర్యవైశ్యులు సన్మానం

బ్రహ్మంగారిమఠం జూలై 02 ప్రభాతవార్త



భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వారి మఠం దేవస్థానంకు మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ఉత్తర్వుల మేరకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పిపిఎన్ ప్రసాద్ ను ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అమ్మవారి శాల అధ్యక్షుడు అయ్యపు సురేష్ బాబు, కార్యదర్శి సుంకు సురేష్ బాబు, కోశాధికారి దుగ్గి శెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సుంకు చిన్న సిద్దయ్య, ఉపాకోశాధికారి పబ్బతి నాగేశ్వరావు, యువజన సంఘం అధ్యక్షుడు యాదాళ్ళ వెంకట సుబ్బయ్య,మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరూ నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

మైదుకూరు, జూలై 02, ప్రభాతవార్త:



రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి ధ్యేయంగా దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి చేస్తున్న సేవలను ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటరమణ ప్రశంసించారు. బేస్తవారం కుంభాభిషేక మహోత్సవానికి విచ్చేసిన మంత్రి ఆనం నారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ వైభవం, సనాతన ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధిపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను భక్తులు, స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన మిద్దె వెంకటరమణ, రాష్ట్రంలోని ప్రాచీన, చారిత్రక, గ్రామీణ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతఃకరణ శుద్ధితో సేవలు అందించండి



వేంపల్లె: జూలై 02 ప్రభాతవార్త

స్వచ్ఛమైన హృదయంతో, ఎలాంటి స్వార్థం లేకుండా అంతఃకరణ శుద్ధితో మానవత సేవలు అందించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు డా.నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షునిగా పోలురు సుభాష్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే కార్యవర్గ సభ్యులు, అనుబంధ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ తోటివారి కష్టాలను అర్థం చేసుకుని, ప్రేమతో సహాయం చేయడం వల్ల మన అంతరాత్మకు మనశ్శాంతి కలుగుతుందని వెల్లడించారు. సమాజంలో ఎంతోమంది నిస్సహాయ స్థితిలో ఉన్నారని, వీరికి మేమున్నాం అని మనోధైర్యం కల్పిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి దోహద పడేలా జీవిత పయణం కొనాసాగాలని పిలుపునిచ్చారు. సమాజం పట్ల బాధ్యత కలిగి నిస్సహాయులైన వారికి అండగా నిలవడమే మానవ లక్ష్యంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో మానవత సేవలు విస్తృతం చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటీ వేంపల్లె శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి, సహాయ ఛైర్మన్ రంగారెడ్డి, కన్వీనర్ డా.యోగీశ్వర్ బాబు, డైరెక్టర్లు, అడ్వైజరీ బోర్డు, ఇసి సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోపాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదగాలి

### డిఇఓ సుబ్రహ్మణ్యం, ఏపీసి అనురాధ

మదనపల్లెక్రైం, జూలై 2 ప్రభాతవార్త.



విభిన్న ప్రతిభావంతులు తమ లోపాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈఓ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసి అనురాధలు పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా సమగ్ర శిక్ష, డీఈఓ సమగ్ర కార్యాలయ ఆధ్వర్యంలో మదనపల్లెలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, విభిన్న ప్రతిభావంతులకు (ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు) ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ అసెస్మెంట్ ద్వారా ఎంపికైన జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 298 మంది అర్హులైన పిల్లలకు బ్యాటరీ సైకిళ్లు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, రిలేటర్లు, టీఎల్ఎమ్ కిట్లు, వినికిడి యంత్రాలతో కూడిన మొత్తం 45 రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లల్లో ఏదైనా ఒక సామర్థం తక్కువగా ఉన్నప్పుడు, దానిని అధిగమించేలా చేసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జనార్దన్ మాట్లాడుతూ, రాష్ట్రానికి 125 ఆర్టిజన్ సెంటర్లు మంజూరయ్యాయని, అందులో అన్నమయ్య జిల్లాకు 5 సెంటర్లు వచ్చాయని వెల్లడించారు. ఒక్కో సెంటర్‌లో 8 మంది కౌన్సిలర్లు, సైకాలజిస్టులు, ఫిజియోథెరపిస్టులు, ప్రత్యేక ఉపాధ్యాయులతో ఈ కేంద్రాలు అతి త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేశారు.

## ట్రాన్స్ ఫార్మర్ లో ఆయిల్ చోరీ

దువ్వూరు, జూలై 02, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లో ఆయిల్ చోరీ కావడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. చింతకుంట గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి పొలం వద్ద ఉన్న ట్రాన్స్ ఫారంను గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ ఆయిల్ అలాగే కాపర్ వైర్ చోరీ అయిందని ఏఈ రాజకుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. దీని విలువ సుమారు 17వేలు ఉంటుందని పేర్కొన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మరోమారు శంకుస్థాపనల నాటకం

వేంపల్లె జూలై 02 ప్రభాతవార్త

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వ్యవహారం పాలకుల రాజకీయ లబ్ధికి, ఎన్నికల వాగ్దానాల అజెండాగా మారిందే తప్ప, జిల్లా నిరుద్యోగుల ఉపాధికి నోచుకోలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా ఉక్కు ఫ్యాక్టరీ పనుల పరిశీలనకు వస్తున్న తరుణంలో, జిల్లా యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు చేస్తున్న హడావుడిని తప్పుపట్టారు. మాజీ సిఎం లు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గతంలోనూ, ప్రస్తుతం చంద్రబాబు ఇలా ముఖ్యమంత్రులు మారిన ప్రతిసారీ ఒకే ఫ్యాక్టరీకి నాలుగైదు సార్లు శంకుస్థాపనలు చేస్తూ కేవలం శిలాఫలకాలకే పరిమితం చేశారని మండిపడ్డారు. మహానాడు సందర్భంగా శంకుస్థాపనలు లేవు, నేరుగా పనులేనని చెప్పి నెలలు గడుస్తున్నా అక్కడ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. కమలాపురం, పెండ్లిమర్రి ప్రాంతాల్లో రైతులను మభ్యపెట్టే వాగ్దానాలకే పరిమితమయ్యారని విమర్శించారు. నిరంతరం ప్రజలను మభ్యపెట్టే పర్యటనలు చేయడం మాని, కడప జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపాలని, ప్రభుత్వ రంగంలోనే ఉక్కు పరిశ్రమను పూర్తి సామర్థంతో నిర్మించాలని సిపిఐ డిమాండ్ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## శాశ్వత వసతులు,
# ఉపాధి కల్పనే విబిజీ రామ్ జీ లక్ష్యం



వేంపల్లె జూలై 02 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత మోలిక వసతులతో పాటు ఉపాధి కల్పనే వి బిజీ రామ్ జీ పథకం లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అ న్నారు. గురువారం తిరుపతి జిల్లాలోని రైల్వేకోడూరు, ముక్కావారిపల్లి గ్రామం లో ఏపి సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉమ్మడిగా విబిజీ రామ్ జీ పథకాన్ని ప్రా రంభించారు. ఈ కార్యక్రమ లైవ్ టెలికాస్ట్ ని స్థానిక ఎంపిడిఓ సభ భవనంలో ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉపాధి శ్రామికులు పాల్గొని విక్షించారు. అనంతరం కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ ఏపి సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు తీసుకువచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ మరోవైపు వివిధ పారిశ్రామిక ప్రాజెక్టుల శం కుస్థాపనలు, గ్రామీణ ఉపాధి పథకాల ప్రారంభం, ఆర్థిక అభివృద్ధి కార్య క్రమాల ద్వారా ఎంతోమందికీ ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. అ లాగే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ల కింద విబిజీ రామ్ జీ పథకాన్ని అమల్లోకి తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో మోలిక వసతులు కల్పిస్తూ ఉపాధి కల్పనే ధ్యేయంగా కూలీలకు భారీ లబ్ది చేకూరుతుందన్నారు. అలాగే ఇప్పటి వరకు ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చేందుకు ఈ పథకం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఓ వెంకట సుబ్బయ్య, ఎం పిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, ఏపిఓ పార్వతి, ఏపిఎం వెంకటేశ్వర రావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, క్లస్టర్ ఇంచార్జీ మహమ్మద్ పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పెద్దమండెం జూ లై 2 ప్రభాతవార్త

గ్రామాల్లో ప్రజా సమస్యలపై అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని గురువా రం జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ అన్నారు మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా అందులోని సమస్యలను ప్రజలకు రైతు లకు అవగాహన కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు రాను న్న వర్షాకాలంలో వాతావరణం కాలుష్యం డ్రైనేజీ కాలువలు వీధి దీపాలు పైప్ లన్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షణలో ఉండాలన్నారు రైతులకు ప్రజలకు తెలి యని వాటిపై అవగాహన కల్పించి వారికి అందని సంక్షేమ పథకాలను అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు మంచినీటిని క్లోరినేషన్ చేసి ఎలాంటి రోగాల కు తావు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేపడుతున్న ప నులను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పంచాయతీ అభి వృద్ధిని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ డిప్యూటీ ఎంపీడీవో వి మల కుమారి పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## వార్త ప్రచురణతో స్పందించిన అధికారులు

ముద్దనూరు, జూలై 02 (ప్రభాతవార్త):



ముద్దనూరు కొత్తకోట్టాల వీధి లో గత 20 రోజులుగా వెలగని వీధి దీపాల సమస్యపై ప్రభాత వార్తలో ప్రచురితమైన కథనా నికి గురువారం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి దీపాలను వెలిగించారు. దీంతో రాత్రి వేళల్లో ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులు తొలగిపోయాయి. సమస్యను పరిష్కరించిన పంచాయతీ అధికారులకు, ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రభాతవార్తకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### ఈఏపీసెట్ 2026 ఫలితాల్లో
# గౌతమ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బద్వేల్, జూలై 2, ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఈఏపీసెట్2026 (ఎంసెట్) ఫలితాల్లో బద్వేల్ పట్టణంలోని గౌతమ్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇంజి నీరింగ్ విభాగంలో మెంటా బాలాజీ రాష్ట్ర స్థాయిలో 9,479వ ర్యాంకు, స య్యద్ ఎం.డి. రాశద్ 14,206వ ర్యాంకు, మామిడి వంశీకృష్ణారెడ్డి 14,651 వ ర్యాంకు, రెడ్డివారి చక్రధర్ 16,439వ ర్యాంకు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. అలాగే అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో బి. నవ్యశ్రీ 16,532వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఉత్త మ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినం దించింది. కరస్పాండెంట్ పంగా సౌజన్య లక్ష్మి, ప్రిన్సిపల్ ఎన్. రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల అంకితభావమే ఈ విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

### ఈఏపీసెట్ ఫలితాల్లో
# సిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం

మదనపల్లెక్రైం, జూలై 2 ప్రభాతవార్త.



ఈఏపీసెట్ ఫలి తాల్లో మదనపల్లె శ్రీ సి ద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చా టి సరికొత్త రికార్డు సృ ష్టించారని కళాశాల కర స్పాండెంట్ వెంకట్ రె డ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో కళాశాల విద్యార్థి ఎన్. రామ్‌చరణ్ రెడ్డి 2156వ స్టేట్ ర్యాంకు సాధించి మదనపల్లె పట్టణంలోనే ప్రథమ స్థానంలో నిలిచా రన్నారు. అలాగే మేఘన 3746 వ ర్యాంక్, ఎమ్. అఫాన్ బేగ్ 4387, బి. నంద కిషోర్ (బైపీసీ) 7183, భాను 10550, పి. మిన్హాజ్ 12036, ఎన్. లక్ష్మి కుమార్ రెడ్డి 12288, కె. నిమ్రా 12356, ఎస్. రుహినాజ్ 12862, బి. హితేష్ 14253 వ ర్యాంక్ లు సాధించారు. 10 మంది విద్యార్థులు 15 వేలలోపు ర్యాంకులు సాధించగా, 52 మంది విద్యార్థులు 25 వేలలోపు స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు. ఈఏపీసెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తి ప్రతిష్టలను పెంచిన విద్యార్థినీ విద్యార్థులను, వారికి నిరంతరం మార్గదర్శ కత్వం వహించిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్ ఇ. వెంకటరెడ్డి, డైరెక్టర్ హేమంత్‌కు మార్లు అభినం దించారు.

# శ్రీ సంజీవరాయ స్వామికి ఘనంగా తొలి పూజలు

రాజుపాలెం, జులై 2, ప్రభాతవార్త

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో నూ తనంగా నిర్మించిన శ్రీ సంజీవరాయ స్వామి ఆలయ ప్రారంభోత్సవము స్వామివారి మహాకుంబాభిషేకం ను ఛైర్మన్ జి.ఎల్ నారాయణరెడ్డి, ఈవో కెవి రమ ణల ఆధ్వర్యంలో వేద పండితులు కార్యక్రమంను పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజన సందోహం నడు మ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమున కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మా త్యులు ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి లు పాల్గొనిమొదటి అర్చన పూజలు ని ర్వహించారు. స్వామివారికి కుంభాభిషేకం అనంత రం గోమాత దర్శనం, కన్యాదర్శనం తర్వాత ప్ర త్యేక దర్శనాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎ మ్మెల్యే వరదరాజు రెడ్డి లకు వేద పండితులు ఆల య సాంప్రదాయాలతో శాలువాలతో ఫల పుష్ప ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాం గణంలో గల శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణ మునకు భూమి పూజ కార్యక్రమంలో మంత్రి రాం నారాయణరెడ్డి ఎమ్మెల్యే వరదరాజు రెడ్డిలు కొ బ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. తొలుత మం త్రికి టిడిపి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు పూ ర్ణకుంభంతో ఆలయ సాంప్రదాయ మర్యాదల ప్రకా రం మంగళ వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. నూతనంగా నిర్మించిన శ్రీ సంజీవరాయ స్వామి ఆ లయ ప్రారంభోత్సవం శిలాఫలకం మరియు నూ తన నిర్మాణమునకు నిధులు మంజూరైన శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్య క్రమం శిలాఫలకమును వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రాఘవరెడ్డి,ఏసీ శంకర్ బాలాజీ, తోట మహేశ్వర్ రెడ్డి, సురేష్ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సూ ర్య ప్రతాప్ రెడ్డి, టంగుటూరు భాష, ఆలయ కమి టీ సభ్యులు మురళీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విబిజి న్యూ స్కీమ్ పనులకు ప్రారంభించిన స్టేట్ డైరెక్టర్



సిద్ధవటం జూలై 2 ప్రభాతవార్త

మాధవరం1గ్రామపంచాయతీలో వి బి జి న్యూ స్కీమ్ పనులకు ఘనంగా భూమి పూజ నిర్వహించి అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించిన ఏపీ స్టేట్ నూర్ భాషా అండ్ దూదేకుల కోఆపరేటివ్ ఫైనల్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతులు వ్య వసాయ పనుల్లో నిమగ్నమై ఉండే సమయంలోఉపాధిహామీ పనులను ని ర్వహించవద్దని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కేంద్ర ప్ర భుత్వ నిబంధనలను అనుసరించి ఉపాధి హామీ పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామన్నారు. గ్రామాభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మోలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం క ట్టుబడి ఉందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను విజ యవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పా ర్లమెంటు టిడిపి కోఆర్డినేటర్ పెగడ హరి ప్రసాద్ మాధవరం టు యూనిట్ కో ఇన్చార్జి మల్లేశ్వరమ్మ ఉపాధి హామీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం



లక్కిరెడ్డిపల్లి: జూలై 2 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయం రైతు కెంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ సా ధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ పేర్కొన్నారు. గురువారం దిన్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన వేరుశనగ పంటను ఆమె పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎండిఎస్ ద్వారా పండ్ల తోటలు బహుళ పంటలు పశుగ్రాసం నైట్రోజన్ స్థిరీకరణ మొక్కలను సమ గ్రంగా సాగు చేయడం వల్ల రైతులకు ఏడాది పొడవున ఆదాయం లభించడం తోపాటు నేల సారవంతం పెరిగి వాతావరణ మార్పులు ప్రభావాలను తట్టుకునే సామర్థం పెరుగుతుందని ఆమె వివరించారు. జిల్లా ప్రాజెక్టు వెంకట మోహన్ మాట్లాడుతూ ఏ గ్రేడ్ వేరుశనగ పంటను ప్రకృతి వ్యవసాయ ద్వారా సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గి నేలలో తేమ కొరత ఏర్పడే పరిస్థితుల్లో విత్తన ఫెర్టిలైజేషన్ అత్యంత ఉప యోగకరమైన ప్రకృతి వ్యవసాయం సాంకేతికత గురించి వివరించారు. విత్త నాలను జీవామృతం గోవుపేడ స్థానిక మట్టి వంటి సహజ పదార్థాలతో పూత పూయడం ద్వారా మనకు శాతం పెరుగుతుందని అంతేకాకుండా విత్తనాలకు ప్రారంభ దశలోనే రక్షణ లభిస్తుందని నేలలో తేమ ఎక్కువ కాలం నిలువ ఉం దేందుకు దోహదపడుతుందని ఆమె వెల్లడించారు. పంట ఎదుగుదల మెరుగైన వాతావరణ మార్పులు ప్రభావం తగ్గి మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నా రు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించడంతోపాటు నేల ఆరోగ్యాన్ని పరిరక్షించి జీవో వైవిధ్యాన్ని పెంపొందించే సమగ్ర ప్రకృతి వ్యవసాయ నమూ నా అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ను కలిసిన శ్రీనివాసరాజు

రాజంపేట, జూలై 2 ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జ నసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ ను రాజంపేట జనసేన నేత ఎ ల్లటూరి శ్రీనివాసరాజు కలిశారు. గురువారం తిరుపతి జిల్లా ఓ బులవారిపల్లె మండలం ము క్కావారి పల్లెలో జరిగిన విబిజి రాంజీ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా ఎల్లటూరి కలిశారు. రాజంపేట నియోజకవర్గం లో పార్టీ పరిస్థితిలను వివరించారు. పార్టీ నిర్మాణం గురించి జనసేనాని అడి గారు.

## 50 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు

మైదుకూరు, జూలై 02, ప్రభాతవార్త:

పట్టణ బద్వేల్ రోడ్డులో ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో డా. డి. సుమధుర ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా సుమారు 50 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు నిర్వ హించారు. విద్యార్థులందరికీ రక్త గ్రూపులను నిర్ధారించడంతో పాటు, రక్తహీ నత సమస్యను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించి వివరాలను నమోదు చేశారు. అనంతరం డా. సుమధుర విద్యార్థులతో వ్యక్తిగతంగా మా ట్లాడి, వారి ప్రస్తుత ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం విద్యార్థులకు ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. డి. సుమధుర మాట్లాడుతూ, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ డి. వెం కటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ నారాయణ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ఎల్లారెడ్డి, ఏఎ న్ఎం మంజీరా, హాస్టల్ ఏఎన్ఎం పెంచలమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైసీపీ నేతల భారీ నిరసన ర్యాలీ

జమ్మలమడుగు, జులై 2, ప్రభాతవార్త:

దేవగుడి గ్రామంలో అర్ధరాత్రి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్‌రెడ్డి ఆ దేశాల మేరకు కూటమి నాయకులు మహానేత డా.వైఎస్ఆర్ విగ్రహాన్ని మూ డు ముక్కలుగా ధ్వంసం చేయడం జరిగిందని గురువారం ఎంపీ అవినాష్‌రె డ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం చేప ట్టారు. జోహార్ వైఎస్ఆర్ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ జమ్మలమడుగు పట్ట ణ పోలీసు స్టేషన్‌కు చేరుకొని చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసా ద్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డా.సుధా, మాజీ మంత్రి అంజాద్‌బాషా, నియో జకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసంహారెడ్డి, ఎస్ఈసీ మెంబర్ గిరిధర్, అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకంలో కొత్త మార్పులు - జిల్లా కలెక్టర్

పెండ్లిమర్రి, జులై 2, ప్రభాతవార్త:







గ్రామీణ పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి, గ్రామా ల సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్పు లు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ఉపయోగకరం గా ఉంటాయని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉ పాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్ర భుత్వం ప్రవేశపెట్టిన వీబీ–జి ర్యామ్(గ్రామీణ్)– విక సిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ కార్యక్రమాన్ని గురువారం దేశవ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం ముక్కా వారిపల్లిలో సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రారంభిం చగా కడప జిల్లాలో కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లిలో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సం దర్భంగా గ్రామంలోని వరద కాలువలో పూడికతీత పనులను, పార, పలుగు పట్టి ప్రారంభించారు. అనంతరం ఉపాధి హామీ పనుల ద్వారా తిప్పిరెడ్డి పల్లిలో నిర్మించిన నూతన క్యాటిల్ షెడ్‌ను వారు ప్రారంభించి స్థానిక రైతుకు చెందిన ఎద్దులకు అం దులో వసతి కల్పించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న ఈ పథకం గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా మరింత మేలు చేకూరు స్తోందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కమలాపురం నియోజక వర్గంలో సమర్థవంతంగా అమలు చేయడం వల్ల గత రెండేళ్లలో సుమారు రూ.120 కోట్ల మేర పను లు చేపట్టినట్లు తెలిపారు. గతంలో రూ.18 కోట్ల వరకు మాత్రమే నిధులు లభించగా జిల్లా కలెక్టర్ చొరవతో ఈ ఏడాది సుమారు రూ.42కోట్ల నిధులు నియోజకవర్గానికి కేటాయించగలిగారని తెలిపారు. రైతులు, ఉపాధి కూలీలు ప్రభుత్వ పథకాలను పూ ర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, గోశాలలు, తో టల పెంపకం, సోక్‌పిట్లు, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులు, నీటి సంరక్షణ పనులు, చిన్న గిడ్డంగులు, గ్రామీణ మార్కెట్లు, నిర్వహణ పనులు వంటి అనేక కొత్త అవకాశాలు ఈ పథకంలో కల్పిం చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఉద్యానశాఖాధికారి రవిచంద్ర, ప శుసంవర్ధకశాఖ పీఆర్, ఇరిగేషన్ ఏపీఎంఐపీ, అ నుబంధ శాఖల అధికారులు, మహిళలు, రైతులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పులివెందుల ఇక ప్రశాంతం.. నేరాలకు తావులేదు

పులివెందుల, జూలై 2, ప్రభాతవార్త :



పులివెందులలో శాంతిభద్రతల పరిరక్షణ కు ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక చర్య లు చేపడుతోందని, ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యమని పులివెందుల టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. పులి వెందులలో ఏర్పాటు చేసిన అత్యాధునిక పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కర్నూ లు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ నచికేత్ విశ్వనాథన్ బా ధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చ ర్యలు తీసుకుంటున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కమాండ్ కం ట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ను బలోపేతం చేయడం వల్ల నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సా గుతుందన్నారు. ప్రస్తుతం పులివెందులలో నేరాలకు పాల్పడాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రజల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇ స్తోందన్నారు. ప్రజలు భయాందోళనలు లేకుండా జీవించే ప్రశాంత వాతావర ణాన్ని కల్పించే దుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పులివెం దులలో శాంతి, భద్రత, అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రజలందరూ సురక్షితంగా, ప్రశాంతంగా జీవించే పులివెందుల నిర్మాణమే అందరి లక్ష్యమని బీటెక్ రవి అన్నారు.

## రైతులకు ఉదయం పూట విద్యుత్ ఇవ్వాలి



దువ్వూరు, జూలై 02, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రామాపురం, జిల్లెల్ల సబ్ స్టేషన్ల పరిధిలో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లకు ఉదయం పూట 4గంటల నుండి ఒం టిగంట వరకు విద్యుత్ సరఫరా చేయాలని ఆ ప్రాంత రైతులు గురువారం వి ద్యుత్ శాఖ ఏఈ రాజకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు ఉదయం 8 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఇస్తున్నారని దీని వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఇవ్వడంతో ప్రస్తుతం ఎక్కువగా గాలి వీస్తుందని దీని వల్ల మాటిమాటికి కరెం ట్ పోతూ ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో మాదిరే తెల్లవారుజామున 4 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఈ విషయాన్ని విద్యుత్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జయనరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠాలకు మైక్సెట్ వితరణ



పీలేరు, జూలై 2 ప్రభాతవార్త:

స్థానిక జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో గణిత ఉపా ధ్యాయురాలుగా పని చేస్తున్న ఖుదిషియాబేగం మైక్సెట్ వితరణ చేశారు. గు రువారం పాఠశాల హెచ్ఎం కిరణ్మయికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సుమారు రూ. 35 వేలు విలువైన మైక్సెట్, ఆటోమేటిక్ బెల్, స్పీకర్లు, వైర్ లెస్ మైక్ వితర ణకు ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అలనాటి దొరతనానికి నిదర్శనం
# నేటి రాజగోపురం

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త



శతాబ్దాల తరబడి ఈ ప్రాంతం జ మీందారుల ఏలుబడిలో వుండేది. పుం గనూరు కేంద్రంగా జమీందార్లు పాలిం చేవారు. పలు గ్రామాలు వారిపేరున ఇ ప్పటికీ పిలువబడుతున్నాయి. స్థానికం గా వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజ యుని ఆలయాన్ని జమీందారు చిక్కరా యలు 600యేళ్ళ క్రితం నిర్మించారు. అప్పట్లో ఆలయం ముందు 52అడు గుల ధ్వజ స్తంభాన్ని నిలబెట్టలేక జ మీందారు చిక్కరాయలు పుంగనూరు వెనుతిరిగాడు. ఆలయ నుంచి కిలో మీ టరు దూరం వెళ్ళగానే మార్గం మధ్య లో ఓ బ్రాహ్మణుడు ఎదురుపడి నిరా శతో వెళ్ళొద్దు వెనుతిరిగి చూడమని చె బుతాడు. వెంటనే జమీందారు చూసేసరికి అక్కడ ధ్వజ స్తంభం నిలబడివుం టంది. ఆ వెనువెంటనే బ్రాహ్మణున్ని చేస్తే ఆయన మాయమవుతాడు. సా క్షాత్తు పరమశివుడే ప్రత్యక్షమై ధ్వజ స్తంభాన్ని ఎత్తించాడనిబ్రాహ్మణుడు కని పించిన ప్రదేశంలో పుష్కరిణి తవ్వించి, రాజగోపురాన్ని ఏర్పాటు చేసాడు. ప్రస్తుతం దొరబావిగా పిలువబడుతూ నాటి దొరతనానికి నిదర్శనంగా నిల బడింది. ఆయనచే నిర్మితమైన కోనేరు రాజగోపురం చెక్కుచెదరకుండా నాటి పాలకులను గుర్తుకు తెప్పిస్తున్నాయి.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం

కడప, జూలై 2 ప్రభాతవార్త:

కడప జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం విజయవాడ నుండి SIR నిర్వహణ, సన్నాహక చర్యలపై.. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ప్రొద్దుటూరు తహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవ్వగా.. కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి డిఆ ర్వో మల్లికార్జునుడు, ఎస్డీసి వెంకటపతి హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రక్రియ అమలు, SIR నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతి పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కా లెక్టర్లతో సమగ్రంగా సమీకించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 18,96, 231 మంది ఓటర్లలో 14,45,697 మంది (76.2 4 శాతం) మ్యాపింగ్ పూర్తయిందని, ఇంకా 4,50, 534 మంది ఓటర్ల మ్యాపింగ్ మిగిలి ఉందని తెలి పారు. మొత్తం 4,62,016 మంది ఓటర్ల వివ రాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు వెల్లడించారు. ఎ న్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.17 శాతం పూ ర్తైందని, అయితే ఫారాల డిజిటైజేషన్ కేవలం 30.80 శాతమే పూర్తయిందని చెప్పారు. డిజిటైజే షన్‌లో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో 321 పో లింగ్ కేంద్రాల్లో డిజి టైజేషన్ 15 శాతం కంటే తక్కువగా ఉం దని తెలిపారు. బుక్ ఏ కాల్స్‌లో వచ్చిన 4,338 ఫిర్యాదుల్లో 4,029కు పరిష్కా రం చూపగా, ఇంకా పెండింగ్‌లో ఉన్న కొ ద్దిపాటి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామ న్నారు. అడ్వర్స్ న్యూస్ పబ్లిష్ కు సంబంధించి మైదుకూరు నియోజకవర్గం నుండి ఒక వార్త వచ్చిం దిని విచారిస్తే.. ఎలాంటి తప్పిదం లేదని తెలిసిం దన్నారు.



# కుక్కల జోరు-ప్రజల బేజారు...!

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త

పట్టణంలోని పలు ప్రాంతాల్లో శునకాల బెడద అధికంగా వుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతి రోజూ కుక్కకాటుకు గురై ఇబ్బందులు పడుతున్నారు. బజారువీధి, గాంధీవీధి, నేతాజీనగర్, ఆసుపత్రి పరిసరాలు, బస్టాండు తదితర ప్రాంతాల్లో శునకాల బెడద అధికంగా వుంది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇళ్ళు విడిచి బయటకు రావాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదిలా వుంటే ద్విచక్రవాహనంలో వెళ్ళే వారిని వెంబడించి మరీ కిందకు పడేస్తున్నాయి. రెండు రోజుల క్రితం కర్ణాటకకు చెందిన దంపతులు ద్విచక్రవాహనంలో వస్తుంటే శునకాలు వారిని వెంటాడటంతో కిందకు పడి తీవ్ర గాయాలపాలయ్యారు. సంబంధిత అధికార, పాలకులు స్పందించి గ్రామాలతోపాటు పట్టణంలోనూ శునకాల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.